# చిరు చక్రం

నిడదవోలు మాలతి

"డియ్యావో బాబొస్తున్నాడంట -"

రోజూ అయ్యగారింటికి ఆరు గంటలకి పరుగెత్తే స్కూల్ ప్యూన్ వెంకన్న ఆ రోజు మధ్య రాత్రిలోనే లాచి ముస్తాబు మొదలెట్టేడు.

"బాగానే ఉంది సంబరం - అద్దరేతిరి ఎద్దెల వరువని - డియ్యావో ఆయెన, ఆడి బాబైనా వొచ్చి నీకేటి వొరగబెడతారు? - వోరం రోజుల్నించి ఒక్కలా కాళ్ళిరగ దొక్కుకుంటున్నావు -"ఇట్నుంచటు వొత్తిగిల్లుతూ విసుక్కుంది సింవాచెలం.

"ఏ వోరగబెడతారో నీకేటి తెలుసు? " తలెగరాశాడు వెంకన్న, పన్నెండు పైసలిచ్చి ఇస్త్రీ చేయించుకున్న చొక్కా తొడుక్కుంటూ.

వాడి కళ్ళముందు నాగయ్యలా ఊగిపోతూ తండ్రి కనిపించేడు. ఎన్మిదేళ్ళ కిందట తను ఉద్యోగంలో చేరేటప్పుడు తండ్రి ఏం చెప్పేడు. "ఒరేయ్ వెంకా, వాళ్ళ కళ్ళు కప్పి ఒళ్ళు దాచుకుని మనవేం మిద్దెలు లేపబోంవు, కాయకష్టం చేసుకుని, గంజినాలు తాగి ఏ చెట్టు కిందో తొంగున్నా మనకు పరువే-" అని చెప్పాడు. అందుకే స్కూలు చుట్టూ తోట పెంచాడు. అది తన పని కాకపోయినా - దానికి వాడికేం స్పెషల్ అలవెన్సు లేకపోయినా -హెడ్‌మాస్టరు శర్మ గారి దగ్గరనుంచి "ఊ బాగానే ఉంది" - కంటె మరో ముక్క రాకపోయినా, ముందటేడు వచ్చిన స్కూళ్ల ఇన్స్‌పెక్టరు గారి భార్యకి బంగారు పువ్వుల్లా మెరిసిపోతున్న ముద్దబంతి పూలు తామరాకులలో అందించాడు.

అవి చూస్తూ ఆవిడ "లవ్లీ" - అంది సార్‌తో అంటూ వెంక్న వేపు మెచ్చుకోలుగా చూసింది.

ఇన్స్‌పెక్టర్ సార్ బింటందుకున్నట్లు మందహాసం చేసి "గార్డెనింగ్ అంతా నువ్వేనా? "అన్నారు.

"అవునండి సార్ "- అన్నాడు వెంకన్న ఉప్పొంగిపోతూ. వాడప్పుడు మొదటి పిక్చరే శతదినోత్సవం చేసుకున్న నిర్మాతలా ీ ఎలయ్యాడు. ఆ తోట అప్పుడు వాడి కళ్ళకి కోడెవయసు ఆడపిల్లలా పండుగ చేసింది.

"గుడ్ మీలాంటి యువకులంతా ఇలా కష్టపడితేనే దేశం బాగుపడేది "అన్నారు ఆయన.

"యస్యస్, హీ యీజ్వెరీ ఇండస్ట్రియనెండ్ సిన్సియర్ "అన్నారు శర్మాజీ కూడా వీలైనంత విశాలంగా మాత్రం నవ్వు మొహం పెట్టి.

వెంకన్న మళ్ళీ బ్రహ్మానందం పడిపోయేడు. ఆ తరువాత అందరూ కలిసి తీయించుకున్న ఫోటోలో కూడా పడ్డాడు. ఆ ఫోటో చూరున వేలాడుతూ, సింవాచెలం అటు వెళ్ళినప్పుడల్లా నెత్తిన ఒకటేస్తూ, అందుకు దానిచేత చీవాట్లు తింటూ ఇప్పటికీ ఉంది.

అసలు స్కూల్లో ఉద్యోగం అయితే గవురవంగా ఉంటుందనీ, పెద్ద పెద్ద వాళ్ళు స్కూలికి వచ్చినప్పుడు, చూడొచ్చనీ మాటాడొచ్చనీ వెంకన్న ఇక్కడ చేరేడు -కాని పల్లెలో తనకి గడవక కాదు. వెంకన్న స్కూల్లో చేరి ఎనిమిదేళ్ళయింది. ఓమాటు సినిమాల్లో రవుడీ వేషాలేసే సూర్యనారాయణ వచ్చేడు. అతను రవుడీలా కాకుండా, చాలా బాగా మాటాడేడని అందరూ అనుకున్నారు. వెంకన్న కూడా అలాగే అనుకున్నాడు. మరోమారెవరో మంత్రిగారొచ్చారు. ఏం జనం. మంగళగిరి

తిరునాళ్ళకు కూడా అంత జనం ఉండరు. ఆయన బిల్డింగు శంకుస్థాపన చేస్తున్న ఫోటోలో పడ్డాడు. ఆయన కూడా వెంకన్నను మెచ్చుకున్నారు.

ఇలాంటి అనుభవాలు వేళ్ళమీద లెక్కపెట్ట గలిగినన్ని ఉన్నాయి. సింవాచలానికి అర్థంకావు. "ఆయ్‌గా ఆ కలిగిన చెక్క చూసుకుంటూ ఆ పల్లెలో పడుంటే పోదూ-" అంటుంది. పొలంలో ఏవుంది? ఒక్కమారు ఏరొచ్చిందంటే గన్‌షాట్ లాగా తుడిచిపెట్టుకు పోవడవేకదా?

"మూడు సంవత్సరాలుగా ఒక్క గింజ రాల్లేదని అన్న చెప్పడంలే? " "ఆడి మాట నమ్మకవేంటి? " అంటుంది సింవాచలం. ఒక మనిషినేనా నమ్మాలి, ఒక దేవుణ్ణేనా నమ్మాలని ఎవరు చెప్పింది - జగ్గయ్యగాబోలు.

స్కూలు వ్యవహారాల్లో ఇంత తకరారుందని సింవాచలానికి తెలియనందుకు వెంకన్న సింవాచలంమీద జాలిపడ్డాడు కూడా.

హుషారుగా ఈలేసుకుంటూ వెళ్ళిపోయిన వెంకన్నని చూసి, నవ్వుకుంటూ లేచింది సింవాచలం పన్లోకెళ్ళడానికి.

వెంకన్నను చూస్తూనే ఉగ్రులయిపోయారు శర్మాజీ. "స్టేషనుకు వెళ్లాలి. చీకటితోటే రమ్మంటే ఇప్పుడా రావడం " అని "ఇంకా కాఫీ కాలేదూ? " అంటూ ఇంట్లోకి ఒక విసురు విసిరి , "వెళ్లు వెళ్లు వేగిరం జట్కా తీసుకురా. ఆ కుంటి గుర్రం కాదు. అదెంత నా బావమర్ది మామగారిదైనా, దాని స్పీడు మైలుక్కైదు గంటలే - ఫో .

పోయి ఆ వీరాసామిని పిల్చుకురా" అని వాడికి పురమాయిస్తూ పంచె కుచ్చెళ్లు పెట్టుకోవడం పూర్తిచేసి, షర్టు తొడుక్కోసాగారు.

వెంకన్న అప్పటికే చాలాదూరం వెళ్లిపోయాడు. అంచేత ఆయన తిరిగి ఇంట్లోకి ఆజ్ఞలు ప్రసారం చెయ్యడంలో మునిగి పోయారు. వారం రోజుల్నుంచి ఆయన ఒక్కలా ఆరటపడిపోతున్నారు. పెద్ద పండుక్కి ఇల్లు కడిగించినట్టు స్కూలు బిల్డింగంతా దగ్గరుండి కడిగించారు. మూల మూలలా *బూజులు దులిపించారు. మూల పారేసిన* లేబరేటరీ సామగ్రితో టేబుళ్ళలంకరించారు. ఇంటింటా, వాడ వాడ చెదిరిపోయిన లైబ్రరీ పుస్తకాలు గూళ్ళు చేరేయి. గోడలికి సున్నాలేయించేరు. బోర్డులకి రంగు వేయించారు. తోట చుట్టూ పడిపోతున్న కంచె నిలబెట్టించేరు.

ఒక్కొక్క పనికోసం ఆయన రైలింజులా రంకెలెయ్యాల్సొచ్చింది. "మాసిన చోటల్లా చూసి సున్నం కొట్టారా" అని ఎలమంద తోచేస్తే, బకెట్‌లో సున్నం కలుపుకొచ్చి, సినిమాలో యాక్షన్ చేసినట్టు కుంచె తన మొహంమీద ఆడించి గోడచాటున చేరేడు బీడీ దమ్ము కొట్టడానికి..

"అలా కూచుంటే పనెలా అవుతుందిరా?" అంటే "ఇప్పుడే ఇలా వచ్చేనండీ "అంటారు. వాడిచేత మళ్లీ కుంచె పట్టించి ఇటు తిరిగి చూస్తే, వెంకన్న తోటలో చేరాడు. "తోట షోకులు తరువాత చూద్దువుగాని, ముందా బోర్డులన్నిటికి రంగులెయ్యా" అని వెంకన్నకి స్పష్టంగా చెప్పేరు. వాడ్ని తోటలోంచి లాక్కురమ్మని పుట్టన్నని తరిమేరు. ఎంతసేపు చూసినా- ఇద్దరిలో ఏ ఒక్కడూ వస్తున్న జాడ కనిపించలేదు. రుస కుసలాడుచూ ఆయనే వాళ్లను వెతుక్కుంటూ బయల్దేరేరు. సౌత్వింగులో ఫస్టు అసిస్టెంటుగారు వాళ్ళచేత బీరువాలు మోయిస్తున్నారు.

లైబ్రరీలో ఎలాగా పుస్తకాలు లేవుకదా అని బీరువాలు సైన్సు లాబరేటరీలో పెట్టి అందులో సైన్సు పరికరాలు, నానచెత్త కూడా పెట్టారు. ఇప్పుడు మళ్ళీ ఎక్కడివక్కడ పెట్టిస్తున్నారు.

శర్మగారికి రావలసింత కోపం వచ్చింది. "అన్నిటికీ ఈ పెద్దలిద్దరే దొరికారుటండీ - లాబ్‌లో ఉన్న అటెండర్లను ఉపయోగించుకోమని చెప్పానుకదా" - గరళంలాంటి కోపాన్ని కంఠంలో నొక్కి పట్టుకొని, ప్రశ్నలాంటి ఆదేశం వెళ్ళగక్కేరు.

"ఎక్కడున్నారండి అటెండర్లు? ఒకడేమో మీ పిల్లల్ని స్కూలునుంచి తీసుకురావడానికి వెళ్ళేడు. రెండోవాడేమో అమ్మగారెందుకో రమ్మన్నారని మీయింటి వెళ్ళేడు. " ఫస్టసిస్టెంటుగారి స్వరంలో ఎన్నాళ్ళనుంచో ఉన్న కక్ష తీర్చుకున్న సంతృప్తి బయల్పడింది. ప్యూన్లని తన ఇంటికి రానివ్వరని ఆయనకు మంట.

"హుమ్ స్కూలునుంచి పిల్లల్ని తీకేకురావడం ఎంతసేపండీ? ఐదు నిముషాల పని చెప్తే అరగంట చేస్తారు వాళ్ళు. తొందరగా రమ్మని మీరు చెప్పొచ్చుకదా? అదీ నేనే చెప్పాలా? నిజమేలెండి - హెడ్‌మాస్టరు కర్కోటక ప్మండా కొడుకన్న పేరు నాకు రావాలి, మీరంతా వాళ్ళకి మంచివాళ్ళు కావాలి. "

శర్మగారు నిష్క్రమించేరు.

తాను చెప్పిందేమిటో, ఆయన అన్నదేవిటో, దానికి,  దానికి సంబంధమేమిటో పొంతన కుదరక తికమక  పడిపోయేరు ఫస్టసిస్టెంటుగారు. అరేంజ్‌మెంట్స్ అయినట్టనిపించేసరికి అందరికి ఇంచుమించు షేక్స్పియర్ మొహాలు పడ్డాయి. ఎంతచేసినా ఏదో ఒక తరగు కన్పిస్తూనేఉంది. చిన్నకూతురు తెచ్చిన కాఫీ పూర్తి చేసేసరికి వీధి మలుపులో గుఱ్ఱం పగ్గం పట్టుకొని వస్తున్న రాములు, ఆ వెనుక గుఱ్ఱం ఆ పక్కనే వెంకన్నా కనిపించారు. తనదింక ఆలస్యంలేదు. కనక శర్మగారు గుమ్మం దిగుతూ, "ఏనిరా - ఇంతసేపా బండి తీసుకురావడం" అని తాంఛనంగా కసుకురుకొని బండెక్కి కూచున్నారు.

"వీరాసామి బండి రుసు ఇరిగిపోయిందండీ. మీరేమో మా బండి వద్దన్నారుగా - రావులు దొరికేసరికి ఇంతసేపయిందండీ." శర్మగారు విన్నా, వినకపోయినా జవాబు చెప్పడం ధర్మంగా వెంకన్న సమాధానం చెప్పి బండి ముందుకు వచ్చేడు.

రాములు గుఱ్ఱం కుంటిది కాదుకాని, కొత్త కావడంచేత రాములు వాటానికది అలవాటు పడలేదు. అంచేత వాడు చెర్నాకోం చెళ్ మనించి. ఎగిరి కమ్మీమీద కూర్చొనేసరికి, అదొక రౌండ్  కొట్టింది. రాములు బండి దిగి, దానికి దిక్కులు సూచిస్తుండగా, గుఱ్ఱం ప్రొటెస్టు చేస్తున్నట్లు వెనక్కి నడవసాగింది. బండిలో ఉన్న శర్మగారిలో ప్రొటెస్ట్ కన్న ఫ్రైటెక్కువయింది.

బండిలోంచి ఒకాలు *యటపెట్టి, దిగలేక , కూర్చోలేక ఇ* బ్బంది పడుతూ, గుఱ్ఱాన్ని, వెంకన్ననీ, రావుల్ని ఉద్దేశించి "రేయ్, రేయ్ దరిద్రుడా - ఈండెక్కడ దొరికిందిరా? ఇదెక్కడి గుఱ్ఱంరా? గుఱ్ఱమేనే, లేక గాడిదా? డియి.వో గారొస్తున్నారంటే ఇలాంటి బండిట్రా తీసుకువస్తావు? " మొదలైన ప్రశ్నలు వేస్తూ, ఆశ్చర్యం ప్రకటిస్తూ ఆరాటనపడిపోతున్నారు.

"మరేం పరవాలేదండీ - కొంచెం కొత్తంటే. కాని పంచకళ్యాణి కాదుటండీ. పరుగందుకుంటే ఆకాశంలో పోతుందండీ." అంటూ రాములు ధైర్యం చెపుతున్నాడు. శర్మగారా - రాములా - ఎవర్ని సైడ్ చెయ్యడం అన్న నడుమ సంశయంలో పడిపోయాడు వెంకన్న. అలా ముగ్గురూ అవస్థలు పడుతుండగా స్టేషను వచ్చింది. లేక రాములూ, గుఱ్ఱమూ, శర్మగారు, వెంకన్నా స్టేషనుకొచ్చారు. రైలు రెండు గంటలు లేటని తెలిసిన తరునాత అందరి మనసులూ కుదుటపడ్డాయి. గుఱ్ఱం మనసు దాణామీద పడింది.

ఫ్లాస్క్, కాఫీ కూడా సేఫ్‌గా ఉన్నందుకు ఆనందించారు.

రెండు గంటలు లేటుగా వచ్చిన రైల్లోంచి డియివోగారు, వారి చిన్నారి సంతానమైన సరోజా, క్లర్కు, జవాను దిగారు. డియివోగారిని మొదటగా ఎదుర్కొని స్వాగతం చెప్పే మహత్భాగ్యం తనకి కలిగినందుకు వెంకన్న ప్యూన్ అందరిలో రాజాలా గొప్పపడిపోయాడు.

"అలా గెడకర్రాలా చూస్తూ నిలబడతావేం - ఆ సూట్‌కేసు, బుట్టా అందుకో"అని శర్మగారు వెంకన్నని కసిరి, డియివోగారిని "ప్రయాణం సుఖంగా నే జరిగిందని" తాననుకుంటున్నట్టు ఆయనికి మనవిచేస్తూ వెయిటింగ్ రూమ్ లాంటి రూమ్‌కు తీసుకు వెళ్ళేరు. డియివోగారు, అమ్మాయిగారు మొహం కడుక్కుంటుంటే, వెంకన్న కాఫీ ఎవరెవరికి ఎలా సర్దడమా అని

ఆలోచనలో పడ్డాడు. డియివోగారి ప్యూను డియివోగారంత దర్జాగాను - ఒకడుగు వెనకే అయినా నడుస్తూ లగేజి అంతా తనచేత మోయించేడు. వెంకన్న ఉలిక్కి పడ్డాడు. శర్మగారు వాణ్ణి దివిట స్థంబంతో పోల్చి, అయ్యగారికి కాఫీ సెర్వ్ చెయ్యమని శపించారు. శాపగ్రస్తుడైన గంధర్వుడిలా ఫ్లాస్క్ తీసుకున్నాడు. కాని కాఫీ అందరికి చాలదని ఎలా చెప్పడమో తెలీక నిలబడిపోయాడు. శర్మగారు మరొకసారి ఉరిమి చూశారు. ఉన్నవాళ్ళలో నువ్వు నయం అని తీసుకొస్తే, నువ్విలా చేస్తున్నావేవిటి అన్న నిష్టూరం ఉంది ఆ చూపులో. దేవుడా ఇంత చేశావా అన్న దైన్యం ఉంది ఆ చూపులో. పోర్షను మరచిపోయిన నటుల్లా  వీళ్ళిద్దరూ చూపులు చూసుకోవడం చూసి డియావో గారికి కోపం వచ్చింది. వారి అమ్మాయిగారికి చిరాకు కలిగింది. ఫస్టసిస్టెంటుగారు కలుగజేసుకొని కప్పుల్లో పోసి డియావోగారికి, అమామయిగారికి ఇవ్వమని సౌజ్ఞ చేసారు. క్లర్కు వెంకన్నను పక్కకు పిలిచి ఇక్కడెక్కడా  టీ దొరకదా అని ఫ్రశ్నించాడు.
ఈయనకి  టీ దొరికితే బాగండును అనిపించింది వెంకన్నకి. "దొరకదు సార్. ఈ సుట్టుపక్కల నాలుగు మైళ్ళలో టీ దుకాణం లేదు. మనూరు పోంగానే ఫస్టక్లాసయిన టీ తెస్తానండి" అంటూ ఒకే నిముషంలో అతగాడి విచారానికి ఉల్లాసానికి, కారణభూతు డయేడు.

శర్మగారూ, కొత్త గుఱ్ఱమూ ఒక్కలా అవస్తపడుతూ, డియావోగారిని మకాం చేర్చారు. వారి మకాం స్కూల్‌లోనే ఏర్పాటుచేయబడింది. ఆ రూము అప్పటికే మూడుసార్లు దులపడం, కడగడం, అయింది.. డియివోగారు అప్రసన్నంగా రూమునొకమారు పరికించడం గమనించి శర్మాజీ, వెంకన్నవేపు తిరిగి "పొద్దున్నే రూము ఊడిపించలేదూ? " అని కసిరినట్టులు ప్రశ్నించి, "లేజీ బగ్గర్" అని కాంప్లిమెంటిచ్చారు. వెంకన్న ఆసమయంలో  - తాను గాజు గ్లాసులో అమర్చిన ఒంటిరెక్క మందార అందాన్ని చూసి ఆనందిస్తున్న అమ్మాయిగారిని చూసి మురిసిపోతున్నాడు. అందుచేత శర్మగారు అన్నమాటకి నొచ్చుకోకుండా ఏదో పెద్దవారు - ఆయన బాధలు ఆయనకున్నాయి. అందుకే ఉదయంనుంచి తాను ఆయనవెంటే ఉన్న సంగతి మర్చిపోయేరు అనుకొని ఊరుకున్నాడు. శర్మగారుకూడా డియివో గారడిగిన మరేదో ప్రశ్నకి సమాధానం కోసం తడుముకోసాగారు.

"ఇక్కడ సిగరెట్లు దొరకవా? ఆయనికి నేవీకట్ కావాలి. " ఇక్కడ *ర్యాలీ తప్పిస్తే బీడీలు మాత్రమే* దొరుకుతాయని ఎలా చెప్పడమో తెలీక వెంకన్నకి పురమాయించారు. "వేగిరం వెళ్ళి ఒక టిన్ నేవీకట్ తీసుకురా. ఇక్కడున్నట్లు రావాలి" అని. వెంకన్న రిలోకురికిన కోడిలా పుంజుకుని సైకిలెక్కాడు. కలికంవేసి చూస్తేఏ నేమీ దొర  జేబు  లోనైనా  ఒకటో అరో దొరకవచ్చునేమోకాని, పూర్తి టిన్ను దొరకదని వాడికి తెలుసు. కాని పుట్టించేడంటే బాబుగారెంత సంతోషిస్తారో వాడూహించేడు.

మిట్ట మధ్యాహ్నం అయేసరికి అర్ధపేకెట్ ఒక చిన్నకొట్లో దొరికింది. "ఐదు సిగరెట్లు తేవడానికి నీకోపూట పట్టిందా?"శర్మగారు కళ్ళెఱ్ఱజేసినా, ఆ కళ్ళలో వాడికి ఎర్రజీర కనిపించలేదు.
"ఇంటికెళ్ళి కారియర్ తీసుకురా. ఇప్పటికే ఆలస్యం అయింది. "
వెంకన్న మళ్ళీ సైకిలెక్కి శర్మగారింటికి వెళ్ళాడు. అమ్మగారు కారియర్ రెడీగానే ఉంచారు కాని, అరిటాకులులేవు. ఆకు కోసం మళ్ళీ ఓ గంటసేపు వాడు వేటాడవలసి వచ్చింది. సంభారాలన్నీ సమకూర్చుకొని స్కూలుకి వెళ్ళేసరికి అక్కడ అందరూ ఆకలితోను, కోపంతోనూ కణకణలాడిపోతున్నారు. వెంకన్న క్విక్ క్విక్‌గా టేబిల్‌మీద అన్నీ సిద్ధంచేశాడు. అందరూ కబుర్లు చెప్పుకుంటూ భోజనం ముగించేసరికి మూడయింది. అప్పుడు శర్మగారు వెంకన్నకి ఇంటికి వెళ్ళడానికి అనుజ్ఞ

ఇచ్చేరు - "అన్నంతిని ఐదు నిముష్లలో వచ్చేయాలి" అనికూడా చెప్పారు. తిండి తినడంమాట దేవుడెరుగు. ఇంటికెళ్ళడాని కి కూడా ఆ ఐదు నిముషలు చాలవని ఒక్క వెంకన్నకే తెలుసు. అంచేత వాడు బస్ స్టాండ్‌లో బస్ దిగి, టీ తాగి వచ్చాడు. అప్పటిక.పది నిముషాలు పట్టింది.

డియీవోగారు ఆ రోజుకి విశ్రాంతి తీసుకుంటారనీ, స్కూలు మర్నాడు దర్శిస్తారనీ ప్రకటించబడింది. వెంకన్న మాత్రం ఆయనకు కావలసివన్నీ అందిస్తూ అక్కడే ఉన్నాడు. డియీవోగారి అమ్మాయి తోట చూడాలని సరదాపడ్డంవల్ల తోట ఇన్స్‌పెక్షన్ ఆరోజు సాయంత్రం చేశారు. అమ్మాయికి కావలసినన్ని పూవులు కోసుకుంది. డియీవోగారు నవనవలాడుతూ పెరిగిన కూరగాయలవైపు తిరిగి "వెరీగుడ్" అన్నారు. వారి అమ్మాయి "బ్యూటిఫుల్"అంది. వెంకన్న వగురుస్తూ, "నమస్కారమండీ" అన్నాడు.

రాత్రి మళ్ళీ హెడ్‌మాస్టర్ గారింటినుంచి క్యారియర్ తెచ్చేడు. వాళ్ళ భోజనాలయేసరికి పదిన్నరయింది. వెంకన్నకి ఇంటి కెళ్ళడానికింకా పర్మిషన్ దొరకలేదు. డియీవోగారు విలాసంగా ఈజీఛైర్‌లోవాలి, సిగరెట్ వెలిగించి, అగ్గిపుల్ల వెనక్కి విసిరేసేరు - అదివెళ్లి టేబుల్‌మీద నాజూగ్గా పరుచుకున్న ప్లాస్టిక్‌క్లాత్‌మీద పడింది. ఆటొమేటిక్‌గా అక్కడ్క డిజైనేర్పడింది. శర్మగారు ఆ టేబిల్‌క్లాత్‌లాగే మండిపడ్డారు. అది ఆయన స్వంతం. డియీవోగారి మెప్పుకోసం ఇంటినించి తెచ్చివేశారు. "యూ బ్లడీ రాస్కెల్, నీకెన్నిమాట్లు చెప్పేను ఎలర్ట్‌గా ఉండాలని. నాకు ఇలా బుద్ధిరాదు. డిస్‌మిస్ చేసేస్తే అప్పుడ్స్తుంది ఎలర్ట్‌నెస్. " "నిన్న చెప్పేనుసార్, యాష్‌ట్రే పెట్టమని. కనీసం సిగరెట్లు తెచ్చినప్పుడైనా తేవాలా? "

యాష్‌ట్రే సంగతి తనకి చెప్పలేదని వెంకన్న చెప్పలేదు. డియీవోగారు నిర్లిప్తంగా, "యు మస్ట్ నో హౌటు మేనేజ్‌దెమ్. ఫైన్ హిమ్" అన్నారు తత్వబోధ చేస్తున్నట్లు. శర్మగారు వెంకన్నకి ఐదు రూపాయలు ఫైను వేసినట్లు చెప్పారు - కారణం నెగ్లిజెన్స్ ఆఫ్ డ్యూటీ.

మర్నాడు డియీవోగారు క్లాసులూ, బిల్డింగు, లాబొరేటరీ, లైబ్రరీ తణికి చేశారు. బిల్డింగు పరిశుభ్రంగా ఉందనీ, తోట అందంగా ఉందనీ, టీచర్లు మంచివాళ్ళలా ఉన్నారనీ మెచ్చుకున్నారు. శర్మగారిని, మిగతా ఉపాధ్యాయ వర్గాన్నీ కరచాలనంచేసి అభినందించారు. పిన్నలని కష్టపడి పనిచెయ్యమని ఆశీర్వదించారు.

డియీవోగారిని రైలెక్కించివచ్చి శర్మగారు అమ్మయ్య వెళ్ళాడురా తండ్రీ. ఇంతకంటె ఇద్దరాడపిల్లల పెళ్ళిళ్ళు చేయడం సులువు. ఇంత కష్టపడ్డందుకు ఆయన బాడ్ రిపోర్ట్ రాయకుండా ఉంటే అంతేచాలు అనికూడా అనుకున్నారు. "డియీవో కరచాలనంచేస్తూ మీకు కంగ్రాయట్యులేషన్స్ చెప్పాలి" అన్నారని గర్వంగా భార్యతో చెప్పారు. అదే సమయంలో వెంకన్న ముందు సింవాచెలం తట్టలో అన్నంపెట్టి అమ్మగారింట్లో అపురూపంగా తెచ్చిన ఆవకాయ ముక్కవేసి, "వారం రోజుల్నుంచి తిండినేదు. ఇప్పడైనా కాస్త తీరిగ్గా తిను" అంది ఆప్యాయంగా. వెంకన్న తృప్తిగా ఆవకాయముక్క కొరుకుతూ సింవాచెలంతో విశేషాలు చెప్తున్నాడు. "అయ్యగారు తోట ఎంత మెచ్చుకున్నారో తెలుసా. వెరీగుడ్ అన్నారు. అమ్మాయిగారు పూలు చూస్తూ ఓహో బ్యూటిఫుల్, లవలీ అన్నారు. హెడ్‌మాస్టర్ సార్ ఒక బుట్టనిండా పూలు, రెండు బుట్టలనిండా కాయగూరలు కోయించి ఆరితో పంపించేరు. ఆరికి పందిరి చిక్కుడంటే ప్రాణంట. మళ్లీ, హెడ్‌మాస్టారితో, టీచర్లందరితో షేక్‌హేండ్‌కూడా ఇచ్చారు. మంచి బాబు. "

వెంకన్న చెప్తూనే ఉన్నాడు. సింవాచలం ముసి ముసి నవ్వులు నవ్వుతూ వింటూనే ఉంది.

వాడు సింవాచలానికి చెప్పని విషయం ఒక్కటే - ముందురోజు తనకి ఐదు రూపాయలు ఫైను పడింన సంగతి !

*******